క్లుప్తంగా

నూతన ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ కృష్ణారావు

పరవాడ: స్థానిక పోలీస్ ఠాణాలో నూతన సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఆర్.రామారావు, బి.కృష్ణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన పి.మల్లేశ్వరరావు దేవరాపల్లి ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్.రామారావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. అదేవిధంగా ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన సిరపరపు సురేష్‌ను ఎయిర్‌పోర్ట్ ఎస్‌ఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నాతవరం నుంచి కృష్ణారావును పరవాడ ఎస్‌ఐగా నియమించారు.

యువతి అదృశ్యం


పసుపురెడ్డి నళిని

మద్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్‌లో తల్లిదండ్రులతో కలిసి పుసుపురెడ్డి నళిని (22) నివసిస్తుండేది. ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్న ఆమె ఈ నెల 14న సాయంత్రం నుంచి కనిపించడం లేదు. అంతటా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి పి.అన్నాజీరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

కొలనులో గణేశుడి నిమజ్జనం


నిమజ్జనంలో గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న చిన్నారులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. గణపతికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి చిన్నారులు తయారు చేసిన కొలనులో సాయంత్రం గణపతిని నిమజ్జనం చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు శ్రావణి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నమ్మి జశ్వంత్, మాన్విత, సీహెచ్ జశ్వంత్, ఎం.జశ్వంత్, జగదీష్, వెంకటీ, కె.నిఖిల, వై.దీక్షిత పాల్గొన్నారు.

క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్ల ధర్నా


దర్నాలో పాల్గొన్న క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు

గాజువాక: క్లాప్ వాహనాల డ్రైవర్లు, లోడర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. జీతాల చెల్లింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్లాప్ వాహనాలను యార్డు నుంచి బయటకు రాకుండా నిలిపివేశారు. ప్రతి కార్మికునికి నాలుగు నుంచి ఆరు నెలల జీతాలు పెండింగ్ ఉన్నాయని, ఇలా అయితే ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు చెల్లించడంలేదని, ప్రమాదం జరిగితే కార్మికుల విషయంలో కాంట్రాక్టరు సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నారని వాపోయారు. దీనిపై ఏ ఒక్కరూ సమాధానం చెప్పడంలేదని కార్మికులు పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌పై జీవీఎంసీ కమిషనర్ చర్యలు తీసుకోవాలని, అవసరమైన కాంట్రాక్టును రద్దు చేయాలని, జీతాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో తమ బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిల్, ఎల్లబిల్లి సుధీర్, జెక్కి లక్ష్మి, రాజు, ధనరాజు, వీర్రాజు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నర్సుల నిరసన ప్రదర్శన

మహారాణిపేట: జీవో 115ను రద్దు చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు చేస్తున్న ఆందోళన 11వ రోజుకు చేరుకుంది. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట వారు సోమవారం కూడా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీ నర్సుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో గత పది రోజుల నుంచి వారు ఆందోళన చేస్తున్నారు. కాంట్రాక్టు నర్సులు జీఎన్ఎం, బీఎస్ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ చదవి ఇప్పటికే ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నవారు ఉన్నారని, తమను రెగ్యులర్ చేయకుండా ఇతరులకు పదోన్నతులు కల్పించవద్దని నర్సులు డిమాండ్ చేశారు.

భైరవస్వామిని చేరే దారేది?

- అటవీశాఖ ఆధీనంలో మార్గం.. కాలి నడకే శరణ్యం
- వాహనాలపై వెళ్లనీయకుండా అటవీశాఖ గేట్లు
- రాళ్లు తేలిన రోడ్డుపై నడవలేకపోతున్న భక్తులు
- రోడ్డు విస్తరణ, పక్కా రోడ్డు నిర్మాణంపై మీనమేషాలు

అడవివరం భైరవస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు అటవీశాఖ తీరుతో కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. ఏళ్లతరబడి ఉన్న రోడ్డు సమస్య తీరలేదు. రాళ్లు, గుంతలు తేలిన రోడ్డులో తాజాగా వాహనాల రాకపోకల్ని నిరాకరిస్తూ అటవీశాఖ హుకుం జారీ చేసింది. ఏకంగా గేట్లు ఏర్పాటు చేసింది. దీంతో ఒకటిన్నర కిలోమీటర్లకు పైగా కాలి నడకనే భక్తులు వెళ్లాల్సి వస్తోంది. పిల్లలతో వచ్చిన వాళ్లు, వృద్ధులకు దేవాలయానికి చేరకముందే భైరవస్వామి చుక్కలు చూపిస్తున్నాడు.



భైరవస్వామి ఆలయం

సింహాచలం: అడవివరం నుంచి కొంత్యాం వెళ్లే ప్రధానరోడ్డులో నాలుగు కిలోమీటర్ల దూరంలో భైరవవాక ఉంది. అక్కడి నుంచి ఒకటిన్నర కిలోమీటరు అటవీ మార్గంలో వెళ్తే భైరవస్వామి ఆలయం వస్తుంది. సింహాద్రి అప్పన్నను దర్శించుకునేందుకు సింహాచలం వచ్చే భక్తుల్లో చాలా మంది భైరవస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఒడిశాకి చెందిన భక్తులు తొలుత భైరవస్వామిని దర్శించుకున్నాకే.. సింహాచలేశుడి సన్నిధికి చేరుకుంటారు. అమావాస్య రోజుల్లో భైరవుడి దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా నుంచి భక్తులు పోటెత్తుతారు. భైరవుడి పుట్టిన రోజైన భైరవాష్టమి, ప్రతి శని, ఆదివారాలు, పౌర్ణమి రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువ. స్వామికి అభిషేకాలు నిర్వహించి, అమృతకలశాలను అందిస్తారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న భైరవస్వామి ఆలయానికి చేరుకునేందుకు సరైన రోడ్డు మార్గం లేక భక్తులు నరకాన్ని చవిచూస్తున్నారు.

ఆలయం అప్పన్నది.. మార్గం అటవీశాఖది

భైరవస్వామి ఆలయానికి చేరుకునే మార్గం, ఆలయం ఉన్న ప్రదేశం అటవీశాఖ ఆధీనంలో ఉంది. ఆలయ నిర్వహణ మాత్రం సింహాచల దేవస్థానానిది. దీంతో మార్గాన్ని విస్తరించి రోడ్డు వేసేందుకు దేవస్థానం అధికార్లు పలుమార్లు పూనుకున్నా అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. ఈ విషయంపై దేవస్థానం అధికారులు ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కి లేఖలు వ్రాయడం, ఆశాఖ ఉన్నతాధికారులు వచ్చి పరిశీలన చేయడం జరిగింది. కానీ ఇప్పటికీ సమస్య తీరలేదు.

కాలినడకే శరణ్యం

భైరవస్వామి దర్శనానికి వెళ్లే దారంతా రాళ్లు తేలి, పెద్ద పెద్ద గోతులతో ఉంటుంది. వర్షం వస్తే గోతుల్లో పెద్ద ఎత్తున నీరు చేరుతుంది. ఎక్కడపడితే అక్కడ బురదతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది. గతంలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల్లో రాకపోకలు సాగించేవారు. ఆరు మాసాల క్రితం అటవీశాఖ ఏకంగా ఆలయానికి వెళ్లే మార్గానికి అడ్డంగా గేట్లు పెట్టింది. భక్తులంతా నడిచే వెళ్లాలని, వాహనాల రాకపోకల్ని నిషేధించింది. దీంతో ఈ గుంతలు, రాళ్లు తేలిన రోడ్లపై కాలినడకే శరణ్యమయింది. వృద్ధులు, చిన్నారులతో వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


మార్గంలో గుంతలు ఏర్పడి నిలిచిన వర్షం నీరు


ఆలయానికి వెళ్లే మార్గం వద్ద ఇటీవల గేట్లు ఏర్పాటుచేసిన అటవీశాఖ

భక్తుల తాకిడి

అమావాస్య రోజుల్లో..	20 వేలు-25 వేలు
పౌర్ణమి రోజుల్లో..	500-1000 మంది
శని, ఆదివారాల్లో..	200-300 మంది


రాళ్లుతేలిన మార్గంపై నడిచి వెళ్తున్న భక్తులు

దేవస్థానం ఆదాయానికి గండి

ఆలయానికి వెళ్లే మార్గంలో అటవీశాఖ గేట్లు అడ్డంగా పెట్టేయడంతో దేవస్థానం ఆదాయానికి కూడా గండి పడింది. ఆలయం వద్ద పూజాసామగ్రి, అమృత కలశాలు, కొబ్బరికాయలు, దీపాల విక్రయానికి ఏటా బహిరంగ వేలం నిర్వహించేవారు. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది జూలై వరకు రూ.38 లక్షల హెచ్చుపాటకి వెళ్లింది. అటవీశాఖ గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఆలయం వద్ద ఎలాంటి విక్రయాలు జరపకూడదని ఆదేశించింది. దీంతో ఈ ఏడాది కాంట్రాక్ట్‌ని దేవస్థానం రద్దు చేసుకుంది.

రోడ్డు వేయాలి



నేను భైరవస్వామి దర్శనానికి తొలిసారి కుటుంబంతో కలిసి వచ్చాను. రాళ్లు తేలిన మార్గంలో నడవడానికి చాలా ఇబ్బంది పడ్డాను. పిల్లలతో వచ్చిన భక్తుల ఇబ్బందులు స్వయంగా చూశాను. ఈ మార్గాన్ని విస్తరించి పక్కా రోడ్డు వేయాలి. అప్పుడే భక్తులకు సౌకర్యం.

– నారాయణమూర్తి, రిటైర్డ్ ప్రైవేటు ఉద్యోగి, రణస్థలం

వాహనాల పై వెళ్లనీయట్లేదు



నేను భైరవస్వామి ఆలయానికి కుటుంబంతో కలిసి వస్తుంటాను. గతంలో ఆలయం వరకు ద్విచక్రవాహనంపై వెళ్లేవాడిని. ఇప్పుడు వెళ్లనివ్వట్లేదు. దీంతో నడిచివెళ్లాల్సి వస్తోంది. రాళ్లు తేలిన మార్గంలో నడవాలంటే భక్తులకు చాలా ఇబ్బంది. అధికారులు పరిష్కారం చూపాలి.

– హేమంత్, గురుద్వార

పూజా సామగ్రి దొరక్క ఇక్కట్లు



నేను తరచూ భైరవస్వామి ఆలయానికి వస్తుంటాను. గతంలో ఆలయం వద్ద పూజా సామగ్రి, అమృతకలశాలు, దీపాలు విక్రయించేవారు. ఇప్పుడు అవేవీ అందుబాటులో లేవు. తెలియని వాళ్లు మళ్లీ వెనక్కి వెళ్లలేని పరిస్థితి. ఇలాంటి వాటి కోసం ఏర్పాట్లు చేయాలి.

– సంతోషి, కంచరపాలెం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



భైరవస్వామి ఆలయ రోడ్డు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అటవీశాఖతో సమస్య పరిష్కారం అయితే రోడ్డు వేసేందుకు సింహాచలం దేవస్థానం సిద్ధంగా ఉంది. జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సూచనల మేరకు ఇటీవల అమావాస్య రోజుల్లో ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అమావాస్య రోజుల్లో ఒకటిన్నర కిలోమీటర్ల మార్గంలో వీధి లైట్లు పెడుతున్నాం. ఆలయం వద్ద తాత్కాలిక క్యూలను ఏర్పాటు చేశాం. మంచి నీటి సౌకర్యం కల్పిస్తున్నాం.

– ఎస్.శ్రీనివాసమూర్తి, ఈవో, సింహాచలం దేవస్థానం

పారదర్శకంగా 'హౌసింగ్'


హౌసింగ్ విభాగం అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ పనులు పారదర్శకంగా జరిగేలా యంత్రాంగం పనిచేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సుజాతనగర్లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం హౌసింగ్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి మిగిలిపోయిన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. సమీక్షలో ఈఈ జి.సత్యనారాయణ, పెందుర్తి ఏఈ ఎం.దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎం.భానుప్రసాద్, వి.నారాయణరావు, అనకాపల్లి పీడీ వై.శ్రీనివాసరావు, డీఈఈ ఏవీఎస్ఎన్ రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పోరుబాట

- రేపు ఈడీ బిల్డింగ్ వద్ద ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో పోరుబాట పట్టారు. అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎల్ఎంఎం పార్కులో సమావేశమైన నాయకులు ఉద్యమంపై చర్చించారు. కాంట్రాక్ట్ కార్మికుల అటెండెన్స్ గేట్లు వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్ల ద్వారా కాకుండా విభాగాల్లో హాజరు ఇవ్వాలని, జీతాల కోత విధించే నిర్ణయం ఉపసంహరించాలని, బయోమెట్రిక్ పేరిట ఏ కార్మికుడిని నిలుపుదల చేసినా అంగీకరించబోమన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఫైనల్ చెల్లింపులో కోత విధించరాదని, స్కిల్డ్ కార్మికులకు ఈఎస్‌ఐ బదులు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి రవి, పిట్టారెడ్డి, పి. భాస్కరరావు, ఉరుకూటి అప్పారావు, ధర్మాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలతో ఇబ్బందులు

పరవాడ: గ్రామీణ ప్రాంత రహదారులకు ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. మండలంలో వాడచీపురుపల్లి-దలాయిపాలెం, వాడచీపురుపల్లి-వెంకటాపురం, నాయుడుపాలెం-తంతడి, తంతడి రోడ్డు-ముత్యాలమ్మపాలెం రోడ్డు, జాజులవానిపాలెం-కలపాక, గొర్లివానిపాలెం-బొద్దపువానిపాలెం, భర్నికం-తానాం రహదారులకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. ఈ రహదారులపై రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు ఈ ముళ్లపొదల కారణంగా గాయాలపాలవుతున్నారు. వీటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సిన పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపుల పెరిగిన ముళ్ల పొదలను, తుప్పల్ని తొలగించాలని కోరుతున్నారు.


దలాయిపాలెం రహదారిలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు

భారీ గోతులు.. ఎగసిపడుతున్న ధూళి

- లంకెలపాలెం-సబ్బవరం దారిలో ప్రయాణికుల అవస్థలు

పరవాడ: లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ఫ్లైయాష్ లారీల కారణంగా ఎగసిపడుతున్న ధూళి ప్రజల ఆరోగ్యాలను హరిస్తోందని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టన్నుల కొద్దీ బూడిదను భారీ వాహనాల ద్వారా తరలిస్తుండటంతో రోడ్డు అధ్వానంగా మారింది. ప్రయాణికులు నానా అగచాట్లు పడుతున్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి బూడిదను ఎగుమతి చేస్తున్న లారీలు లంకెలపాలెం మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిపై ఎలాంటి టార్పన్లు వేయకుండా రవాణా చేస్తుండటంతో దారంతా ఎగసిపడుతున్న ధూళి ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతోంది. ధూళిని పీల్చడం వలన గొంతు, కళ్ల మంటలతో పాటు శ్వాసకోశ, చర్మవ్యాధుల బారిన పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో బూడిద కళ్లల్లో పడి, ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధిక బరువు కలిగిన బూడిద లారీలు నిత్యం రాకపోకలు సాగించడం వలన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఎక్కడికక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళ రహదారిలో ప్రయాణం భయంగొలుపుతోంది. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో ఏది రోడ్డో.. ఏది గొయ్యో తెలియక ప్రమాదాలన బారిన పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. బూడిద రవాణాలో జాగ్రత్తలు పాటించి, రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పెదముషిడివాడ రహదారిలో ఫ్లైయాష్ ధూళి


అధ్వానంగా మారిన సబ్బవరం రహదారి

స్టీల్‌ప్లాంట్‌పై రాజకీయాలు చేయబోం

- సింహాచలం పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం: మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై వాజ్‌పాయి హయాం నుంచి టీడీపీ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. అప్పట్లో ఎంపీలుగా తనతోపాటు ఎర్రంనాయుడు, ఎంవీఎస్ మూర్తి వాజ్‌పాయిని కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని నిలబెట్టకపోవడంతో గెలిచిన వ్యక్తి, ఇప్పుడు ఇష్టారీతిన మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా టీడీపీ కాపాడుతుందన్నారు. దీనిపై ఎలాంటి రాజకీయాలు చేయబోమన్నారు. అప్పన్న దర్శనం కోసం వచ్చిన గంటా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తరం పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రం అందజేశారు.


గంటాకు అప్పన్న ప్రసాదాన్ని అందిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం


దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి: విశాఖ ఉక్కును పరిరక్షించుకోడానికి ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం చేపట్టిన 1313వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. దీర్ఘ కాలంగా ఆందోళనలు, ఉద్యమాలు, రాస్తారోకోలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వ పెద్దలు కనీసం చలించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కదలిక తీసుకురావడానికి ఎలాంటి పోరాటాలకైనా, త్యాగాలకైనా సిద్ధమే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు మసేన్‌రావు, డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, సాంబశివరావు, జి.రాజు, డేవిడ్, సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలు.. నిమజ్జనోత్సవాలు


పురుషోత్తపురం కంఫర్ట్ హోంలో లడ్డూ వేలంలో పాల్గొన్న భక్తులు


వడ్డన చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు


గణపతి సన్నిధిలో గండి రవి కుమార్ తదితరులు

పెందుర్తి: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం భవానీనగర్‌లో అన్నసమారాధన జరిగింది. వెయ్యి మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. కాలనీ ప్రతినిధులు బొడ్డు నారాయణమూర్తి, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. విజయ గణపతి హోమం, సహస్ర నామార్చన, అష్టోత్తర పూజలు జరిపారు. అనంతరం లడ్డూ వేలం సందడిగా జరిగింది. సాయంత్రం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా జరిపారు. కమిటీ ప్రతినిధులు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సబ్బవరం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలను పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ సోమవారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సబ్బవరంలోని సాయినగర్ కాలనీ, మొగలిపురంలోని సిరపరపువారి కల్లాల వాసులు ఏర్పాటు చేసిన మండపాల వద్ద స్వామివారిని దర్శించుకుని, మధ్యాహ్నం అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ని సత్కరించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పార్టీ నాయకులు యర్రంశెట్టి రాము, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మొగలిపురం ఉపసర్పంచ్ సిరపరపు వాసు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుడో పోటీల్లో ఎన్టీపీసీ విద్యార్థుల ప్రతిభ


బంగారుపతకాలు సాధించిన విద్యార్థులతో కుడో ప్రతినిధులు

పరవాడ: స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఈ నెల 15న జరిగిన 4వ రాష్ట్ర స్థాయి కుడో చాంపియన్‌షిప్‌లో ఎన్టీపీసీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలను కైవసం చేసుకున్నట్లు కోచ్ గొర్లి పుష్పారావు సోమవారం తెలిపారు. ఎన్టీపీసీకి చెందిన టి.సుమశ్రీ, టి.భవ్యశ్రీ, గొర్లి వంశీ, చాందిని, అనూజ, అక్షిత్‌వర్మ, సునైన, రిత్విక్, కె.ప్రహర్షిత, ఎం.కార్తీక్, కె.వీక్షిత, డీఏ గౌతమ్, కె.పణీంద్రకుమార్, బి.మణికంఠ, ఎస్.లీల, ఎస్.గోపాల్‌కుషాల్ బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. కుడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ మహాల్వారా, జనరల్ సెక్రటరీ జాస్మిన్ మక్వానా చేతుల మీదుగా వీరు పతకాలు అందుకున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు సూరత్‌లో ఈ ఏడాది నవంబర్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతల్ని ఆంధ్రప్రదేశ్ కుడో ప్రెసిడెంట్ అల్లూరి శశిధర్, ట్రెజరర్ అల్లూరి అనురాధ, డైరెక్టర్ తులసీరావు తదితరులు అభినందించారు.

గంజాయితో యువకుడి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న యువకుడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం పెదబయలు ప్రాంతానికి చెందిన బాల గంగాధర్ తిలక్ (24) గంజాయి తీసుకొచ్చి పితానిదిబ్బలో విక్రయానికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి టూటౌన్ ఎస్‌ఐ శంకరరావు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తాగిన మైకంలో చెరువులో పడి వ్యక్తి మృతి


ఇమాన్యుయేల్ మృతదేహం

పరవాడ: తాగిన మైకంలో చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన దేశపాత్రునిపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీకి చెందిన ఇమాన్యుయేల్(27) మరణించినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. వివరాలు. పెయింటర్‌గా పనిచేస్తున్న ఇమాన్యుయేల్ భార్య రజనీతో కలిసి సాయినగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. తన స్నేహితులైన రవికుమార్(స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి), రాజుతో కలిసి సోమవారం ఉదయం మద్యం సేవించాడు. అనంతరం తనను ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకువెళ్లాల్సిందిగా రవికుమార్‌ను కోరాడు. మాటలాడుకుంటూ ముగ్గురూ కలిసి దేశపాత్రునిపాలెం చెరువు వైపు వచ్చారు. చెరువు వద్ద ఇమాన్యుయేల్, రవికుమార్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిని ఒకరు నెట్టుకుంటూ ప్రమాదవశాత్తూ ఇరువురూ చెరువులో పడిపోయారు. రవికుమార్ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. ఈతరాని ఇమాన్యుయేల్ చెరువులో మునిగిపోతుండగా స్థానికులు బయటకు తీశారు. అప్పటికే ఇమాన్యుయేల్ ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న సీఐ మల్లికార్జునరావు ఘటనాస్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.